క్లుప్తంగా

ఆవిర్భావ సదస్సు విజయవంతం చేయాలి

గోపాల్‌పేట: బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు రామకృష్ణ, నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. శనివారం జిల్లా కేంద్రం దాచలక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో జరిగే బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికారం కోసం భవిష్యత్తు కార్యాచరణ సమావేశం ఉంటుందన్నారు. మండలంలోని మేధావులు, విద్యావంతులు, ఆయా కులసంఘాల పెద్దలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి విషారదన్‌మహారాజ్, నాగం కుమారస్వామి, ప్రొ. రామయ్య యాదవ్, దాసోజు లలిత, తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాచాల వినోద్ యాదవ్ పాల్గొంటారని తెలిపారు.

భూ పోరాట యోధుడు ఉస్సేన్

వనపర్తి రూరల్: భూ పోరాట యోధుడు దళిత నాయకుడు ఎనుముల ఉస్సేన్ అని కేఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారావు సరోజ, ఆలిండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం ఉస్సేన్ వర్ధంతి సందర్భంగా పాతపల్లి గ్రామంలో పలువురు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి గోవిందు, జె.చక్రవర్తి, భారతి, రామచంద్రయ్య, సరోజ పాల్గొన్నారు.

గట్టయ్యకు పీహెచ్‌డీ పట్టా



పాన్‌గల్: మండలం దావత్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన కొంకల గట్టయ్య ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ సుజాత పర్యవేక్షణలో రియల్‌టైమ్ మెషిన్ లెర్నింగ్ విశ్లేషణ, పర్యవేక్షణ ద్వారా భారతీయ స్మార్ట్ నగరాలు, ప్రజారవాణా, నిర్వహణను మెరుగుప ర్చడం అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేశారు. పాలమూరు యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొ ఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం అందజేత

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన పోతుగంటి స్వాములు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు తాపి మేస్త్రీల సంఘం నాయకులు రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కురుమూర్తి, ఆనంద్‌యాదవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో ప్రయోజనాలు

వీపనగండ్ల: విద్యలో విద్యార్థులు రాణించేందుకు ఉపాధ్యాయులు నియమిస్తున్న అవగాహన సదస్సులు ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తాయని రిసోర్స్‌పర్సన్ మల్లేష్‌కుమార్, అక్బర్‌పాషా అన్నారు. శుక్రవారం తూముకుంట కాంప్లెక్స్ సమావేశంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు వారి సబ్జెక్టుపై పలు అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, సెక్రటరీ శివరాములు, సీఆర్‌పీ నాగరాజు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు

అమరచింత: మిలాద్ ఉన్ నబీ వేడుకలు పురస్కరించుకొని పట్టణంలోని ముస్లిం యువకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్, సీఐ శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆయా వీధులగూండా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మసీద్‌కమిటీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్‌కోర్సులపై అవగాహన

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఒకేషనల్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక నైపుణ్య, అగ్రికల్చర్ కోర్సులపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనర్సింహా ట్రేడర్స్ షాప్‌లో పురుగుమందులపై, తెలంగాణ గ్రామీణ బ్యాంకు విధులపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, అఖిల, సురేందర్‌రెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

చెత్తపారబోస్తే జరిమానా



ఆత్మకూర్: చెత్తను ఆరుబయట పారబోస్తే జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఆయా కాలనీల్లో వార్డుల అధికారులు, కార్మికులతో కలిసి డ్రైడే ఫ్రైడేలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.అదేవిధంగా స్థానిక కిరాణషాపులో 120 ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.2వేలు జరిమానాను విధించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడుకేటర్ సురేందర్‌గౌడ్ ఉన్నారు.

పెద్దచెరువు తూముకు పగుళ్లు

- పడమటితూము నుంచి వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని అధికారులు
- త్వరగా మరమ్మతు చేయాలి : రైతులు



అమరచింత పెద్దచెరువు పడమటి తూము పగుళ్లు



పగుళ్లు ఏర్పడిన దృశ్యం

అమరచింత: పట్టణంలోని పెద్దచెరువుకు సంబంధించిన పడమటితూము గత కొన్ని రోజులుగా పగుళ్లతో లీకేజీతో సాగునీరు వృథాగా పోతున్న సంబంధింత అధికారులు పట్టించుకోలేని దుస్థితి ఏర్పడింది. అమరచింత పెద్దచెరువు పరిధిలో 360 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. గత కొన్నేళ్లుగా భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు చెరువుకు అందుతుండటంలో ఆయకట్టు రైతులు ఏడాదిలో రెండుపంటలను పండించుకుంటున్నారు. రైతులతో పాటు చేపలను పెంచుకుంటూ చెరువు ఆధారపడి సుమారు 300 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. మండలంలోనే అతిపెద్దదైన చెరువును ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని ఆయకట్టు రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్న పట్టించుకునే నాయకులే కరువయ్యారు. ప్రస్తుతం చెరువు ఆయకట్టు పరిధిలో యాసంగిలో వరిపంటను రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇందుకు గాను చెరువు కాల్వలో పూడికను తొలగించుకునేందుకు రైతులు సమిష్టిగా ఏర్పడి ఎకరానికి రూ.500 ఖర్చుచేస్తు పూడికను తొలగించుకుని సాగునీటిని తమ పంటపొలాలకు తీసుకెళ్తున్నారు. చెరువులో మూడు తూములు ఉన్నాయని, వాటికి గేట్‌లు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

నెర్రెలు బారుతున్న చెరువుకట్ట :

చెరువు ప్రధాన ఆనకట్ట నెర్రెలు బారుతున్న నీటిపారుదలశాఖ అధికారులు వాటిని గుర్తించలేక పోతున్నారు. వీటికితోడు ఆనకట్టకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో రైతుల ద్విచక్ర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పురపాలికగా ఏర్పడి ముళ్లపొదలను ఈజీఎస్ ద్వారా తొలగించలేని దుస్థితి ఏర్పడింది. గతంలో పంచాయతీగా ఉన్నప్పుడు వందరోజుల పనులతో చెరువులో పూడికతోపాటు ముళ్లపొదలను తొలగించేవారని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి పడమటి తూము మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని కోరుతున్నారు.

> **మరమ్మతులు చేపడతాం..**
>
> అమరచింత పెద్దచెరువు మధ్య తూము నెర్రెలు బారిందనే విషయాన్ని రైతులు తెలిపారు. తూములను పరిశీలించడంతో పాటు మరమ్మతులకు ప్రతిపాదలను సిద్ధం చేశాం. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది. నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతాం.
>
> –ఆంజనేయులు, ఏఈ అమరచింత

రాకపోకలకు ఇబ్బందులు కలగొద్దు

వనపర్తి: ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మర్రికుంట చెరువు నుంచి నీరు సజావుగా వెళ్లేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మర్రికుంట చెరువుబండ్‌ను సందర్శించి అక్కడ నుంచి నీటి ప్రవాహ మార్గాలను, పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, అధికారులతో మాట్లాడి కాల్వ ప్రవహించే మార్గాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

డిజిటల్‌లైబ్రరీ సేవలను వినియోగించుకోవాలి

జిల్లాలోని నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయాన్ని ఆకస్మికంగా గ్రంథాలయానికి వచ్చిన పాఠకులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా జిల్లా గ్రంథాలయం భవనం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, కమిషనర్ వెంకటేశ్వర్లు, లీడ్‌బ్యాంకు మేనేజర్ శివప్రసాద్, సాయి ఉన్నారు.

వనపర్తి: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం మర్రికుంటలోని గిరిజన సంక్షేమ గురుకులాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఏఐ క్లాసెస్‌ను పరిశీలించారు. అనంతరం ఇంటర్ విద్యార్థుల వీక్లీ పరీక్షల మార్కుల పట్టికను పరిశీలించారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపల్ సరస్వతి ఉన్నారు.

విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడండి



గురుకుల పాఠశాలను సందర్శించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

గోపాల్‌పేట: గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రిన్సిపల్స్‌దేనని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం వారు మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఎలుకలు కరిచాయి అన్న విద్యార్థులను కలిసి వారి బాగోగులు తెలుసుకున్నారు. కరిచాయా లేదా అన్నది తమకు కూడా తెలియదని విద్యార్థులు చెప్పారు. ముందు జాగ్రత్తగా టీటీ ఇప్పించడం మంచిదేనన్నారు. అలాగే పాఠశాల, కళాశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రిన్సిపాల్, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాఠశాలలో తిరిగి ఏమేం సమస్యలు ఉన్నాయని విద్యార్థులతో తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలని కోరారు. కోతుల బెడద ఎక్కువగా ఉందని విద్యార్థులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు విశ్వంబాబు, ద్యారపోగు వెంకటేష్, బీరప్ప, చిన్నమ్మ థామస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



పాఠశాల ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

ఖిల్లాఘనపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవైజ్ వర్కర్లను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండలకేంద్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాల వర్కర్లు శుక్రవారం పాఠశాల ఎదుట బైఠాయించి నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యల పట్ల స్పందించాలని వారు డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటుగా జీఓ 64ను నిలుపుదల చేసి గతంలో మాదిరిగా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. పలుమార్లు సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికి స్పందించక నిరవధిక సమ్మెకు దిగామని తెలిపారు. కార్యక్రమంలో షంషొద్దీన్, రాజు, చెన్నకేశవులు, అలివేలు, చంద్రకళ, ఇందిరమ్మ పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ మీటర్ సౌకర్యం

వనపర్తి: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల శివారులోని భవానీశంకర్ రైస్‌మిల్లులో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్ధారించారు. ఈ నెల 11న సాక్షిలో ఇదేమి చోద్యం అనే శీర్షికన ప్రచురితమైన వార్త కథనానికి సివిల్ సప్లయ్ శాఖ రాష్ట్ర కమిషనర్ చౌహన్ స్పందించారు. ఆయన ఆదేశం మేరకు ఉన్నతాధికారులు విచారణ చేసి అక్కడ త్రీఫేస్ విద్యుత్ ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు విచారణ చేసి ధాన్యం కేటాయింపులు చేశామన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న తిరుమల్

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలో శాంతినగర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్ అన్నారు. శుక్రవారం ఆయన పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఒకే గదిలో ఒక్క టీచర్‌తో 5 తరగతులకు బోధిస్తున్నారన్నారు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం ఎంఈఓ మద్దిలేటికి పాఠశాలలో సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పరిష్కరించకుంటే బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శంకర్, విభూది చంద్రయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న యుగంధర్‌గౌడ్ తదితరులు..

వనపర్తి రూరల్: తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోరా అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా.యుగేంధర్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం పెబ్బేరు చెలిమిల్ల, శేరుపల్లి వద్ద అసంపూర్తి ఉన్న బ్రిడ్జిల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిపై వాగులపై బ్రిడ్జిల నిర్మాణం పూర్తి కాకపోవడంతో వర్షాలకు డైవర్షన్ రోడ్డు తెగి దాదాపు 50 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పూర్తిచేయడంలో కాంట్రాక్టర్ శ్రద్ధ చూపడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో దేవరశివ, రాఘవేందర్‌గౌడ్, రామన్‌గౌడ్, యశ్వంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో డెంగ్యూ సోకడంతో ఆయా గృహాలను సందర్శించి వివరాలను సేకరించి, చుట్టుపక్కల గృహాల వారి నుంచి వ్యాధి నిర్ధారణ నిమిత్తం రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య వైద్యులు లారెన్స్, సిబ్బంది శాంతమ్మ, రాంచందర్, సతీష్, మదన్‌గోపాల్, పంచాయితీ కార్యదర్శి నందకిశోర్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని తూముకుంట ఇసుక రీచ్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా శుక్రవారం అక్రమ ఇసుకను తరలిస్తున్న తూముకుంట గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని సుధాకర్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించే ట్రాక్టర్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు.

గణిత సామర్థ్యాలను మెరుగుపర్చాలి

పాన్‌గల్: గణిత సబ్జెక్టుపై విస్తృతంగా ప్రాక్టీస్ చేయిస్తూ విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలను మెరుగు పరిచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో పాన్‌గల్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల గణిత టీచర్లకు సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. సరైన ప్రణాళికబద్ధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలన్నారు. ఆర్పీలు రామకృష్ణ, విజయ్, అర్జున్‌నాయక్ అవగాహన కల్పించారు. సమావేశంలో గణిత ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సకాలంలో యూరియా అందించాలి

వనపర్తి రూరల్: జిల్లాలోని రైతులకు సకాలంలో యూరియాను అందించి కాపాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రం వ్యవసాయ మార్కెట్‌లో రాఘవేంద్ర ఫర్టిలైజర్ షాప్ వద్ద ఆయన రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు మాత్రం సరిపడా యూరియా ఉన్నదని చెప్తున్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

అమరచింత: ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. పురపాలిక కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఇందిరమ్మ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 67 ఇళ్లు మంజూరు అయ్యాయని, బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న 8మంది లబ్ధిదారులకు రూ.లక్ష బిల్లును అందించారన్నారు. కార్యక్రమంలో మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఖిల్లాఘనపురం: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ ప్రిన్సిపాల్ రాజశేఖర్, ట్రైనర్ మధు, నిర్వాహకులు దీర్ఘాయువులు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో ధ్యానంపై తరగతులు నిర్వహించారు.కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ బి.బీరయ్య, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్యం

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యుడు ఫయాజ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగరాజు అన్నారు. డ్రైడేలో భాగంగా శుక్రవారం 2వ వార్డు కొత్తతండాలో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపునీరు నిల్వ ఉన్న రహదారుల దోమలు నివారణ కోసం మందులను పిచికారి చేస్తున్నామన్నారు. అనంతరం ఎస్సీ వసతి గృహంలోని మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

జ్వర బాధితులను పట్టించుకోని అధికారులు

అమరచింత: మండలంలోని కొంకన్వానిపల్లె గ్రామంలో ప్రజలు జ్వరాల బారిన పడుతూ నిత్యం ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా పంచాయతీ అధికారులు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టలేక పోతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ శుక్రవారం ఆరోపించారు. గ్రామంలో డెంగ్యూ జ్వరంతో బాధపడిన వైద్యఆరోగ్యశాఖ అధికారులు జ్వర బాధితులను గుర్తించలేక పోతున్నారన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు లేని కారణంగా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వారు కోరారు.

అలుగు పారి.. నీటమునిగిన పంటలు



నీట మునిగిన వరి పంట

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామ ఊరచెరువు అలుగు పారుతుండటంతో ఆలుగు నీరు చేరి వరి పంటలు నీట మునిగాయి. గ్రామ రైతులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం కురిసిన భారీ వర్షానికి గ్రామ ఊర చెరువులోకి వరద నీరు చేరడంతో చెరువు అలుగు పారింది. వాగులో జమ్ము పెరగడంతో నీరు ముందుకు పారకపోవడంతో పరిసరాల్లోని దాదాపుగా 50 ఎకరాల వరకు వరి పంటలు నీట మునగడం, పంట పొలాలు కోతకు గురైందని రైతులు వాపోయారు. ఎంతో ఖర్చు చేసిన పంటలు అలుగు నీటితో నీట మునిగి నష్టం వాటిల్లిందన్నారు. ప్రతి వర్షాకాలం సీజనల్‌లో ఇలా నష్టమవోతుందని, గతంలో పలుమార్లు వాగు ప్రాంతంలో పేరుకపోయిన జమ్మును తొలగించాలని అధికారులకు విన్నవించిన వారు సమస్యను పరిష్కరించకపోవడంతోనే నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాగులో పేరుకపోయిన జమ్మును తొలగించి నష్టం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యం, రోడ్ల మరమ్మతులు, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ ఎంపీ డీకే అరుణను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో కలిసి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలోనే మండలంలోని అన్ని సమస్యలను పరిష్కారమని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈనెల 17న ప్రధానమంత్రి మోదీ జన్మదినాన్ని పురష్కరించుకుని రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశించారని వారు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంభాళాపురం రాము, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన భోజనం ఏర్పాటు చేయాలి



అమరచింతలో భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో గల ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఇంచార్జి ఎంపీడీవో సుదర్శన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ ప్రాంగణం , స్టోర్‌రూమ్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వారివెంట వార్డెన్ సత్యనారాయణకు, సంక్షేమఅధికారి ఎస్. సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న ఇంచార్జ్ ఎంపీడీవో

అమరచింత: విద్యార్థినులకు భోజనంలో పౌష్టికాహారం నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి అఫ్జలుద్దీన్ అన్నారు. శుక్రవారం కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జ్వరపీడితులను వైద్యం అందించాలని ఎస్ఓ ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



పాన్‌గల్ రేమద్దులలో ఏచూరికి నివాళులర్పిస్తున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: కామ్రేడ్ సీతారాం ఏచూరి లేని లోటు స్పష్టంగా కనిపిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.జబ్బార్ అన్నారు. మండలంలోని రేమద్దుల గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులరిర్పాచరు. కార్యక్రమంలో గుంటివెంకటయ్య, భగత్, భాస్కర్, ఎండీ.ఖాజా, మల్లేష్, చంద్రశేఖర్, నిరంజన్, బాలస్వామి, భాస్కర్‌గౌడ్, మహేష్, లక్ష్మణ్, బాలకృష్ణయ్య, తిరుపతి, రాములు పాల్గొన్నారు. అలాగే తెల్లరాళ్ళపల్లి, తెల్లరాళ్ళపల్లితండాలో సీపీఎం మండల కార్యదర్శి బాల్యనాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరచింత: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేష్, రవి, విష్ణు, చంటి, బుచ్చన్న, శ్యాంసుందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలో సీతారాం ఏచూరి వర్ధంతిని అంబేద్కర్‌చౌక్‌లో చిత్రపటానికి పలు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలకార్యాదర్శి రాజు, వ్యవసాయకార్మికసంఘం జిల్లాఅధ్యక్షుడు అజయ్, బీడీకార్మికసంఘం జిల్లాఉపాధ్యక్షుడు బుచ్చన్న, ప్రసాద్, సుజాత, స్వప్న, సామేలు, ఎంకన్న ఉన్నారు.

సీతారం ఏచూరికి ఘన నివాళి

కొత్తకోట రూరల్: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కొత్తకోటలో సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిక్సన్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.వెంకటయ్య, పి.రాములు, ఎస్.ఆంజనేయులు, ప్రియదర్శనం, వి.నరసింహ, పి.వెంకటన్న, లింగప్ప, ఎల్లప్ప, బలరాం, రాజు తదితరులు ఉన్నారు.